నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, మంగళవారం 11 ఫిబ్రవరి 2025 RANGAREDDY










# ఉప్పొంగిన అభిమానం..

## హకీంపేటకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రావడంతో ఆనందం వ్యక్తం చేసిన గిరిజన రైతులు

- దారిపొడవునా హారతులిచ్చి.. సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం
- ఉదయం నుంచే ఆయన రాక కోసం నిరీక్షించిన లగచర్ల, హకీంపేట, రోటిబండతండా, పోలేపల్లి రైతులు
- తుంకిమెట్లలో పార్టీ జెండా ఆవిష్కరణ.. అనంతరం రైతులను కలిసిన మాజీ మంత్రి కేటీఆర్
- తుంకిమెట్ల నుంచి హకీంపేట వరకు గులాబీమయం
- రామన్న రాకతో బీఆర్ఎస్ క్యాడర్‌లో ఫుల్ జోష్


మొయినాబాద్ : హిమాయత్‌నగర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వికారాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రావడంతో లగచర్ల గిరిజన రైతుల్లో అభిమానం ఉప్పొంగింది. దారి పొడవునా ఆటపాటలు, హారతులిచ్చి వారి సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. లగచర్ల రైతులకు మొదటి నుంచి అండగా నిలిచిన కేటీఆర్.. సోమవారం హకీంపేటకు వస్తున్నాడని తెలిసి లగచర్ల, హకీంపేట, రోటిబండతండా, పోలేపల్లి రైతులు ఉదయం నుంచే ఆయన కోసం ఎదురు చూశారు. మాజీ మంత్రి కేటీఆర్ కోస్గి బహిరంగకు వెళ్తూ తుంకిమెట్ల వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం హకీంపేట వద్ద లగచర్ల రైతులను కలుసుకున్నారు. లగచర్ల ఘటనలో పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన తన భర్తను విడిపించుకునేందుకు ఢిల్లీ వరకు వెళ్లి న్యాయ పోరాటం చేసిన నిండు గర్భిణి జ్యోతి విజ్ఞప్తి మేరకు కేటీఆర్ ఆమె బిడ్డకు భూమిగా నామకరణం చేశారు. కొడంగల్ సెగ్మెంట్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకతో శ్రేణుల్లో ఫుల్ జోష్ వచ్చింది. గులాబీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. తుంకిమెట్ల నుంచి హకీంపేట వరకు ఎక్కడ చూసినా గులాబీమయంగా మారిపోయింది. కొడంగల్ నుంచి పట్నం నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని ఇచ్చిన హామీ ప్రకారం కేటీఆర్ సెగ్మెంట్ అభ్యున్నతికి భారీగా నిధులిచ్చి రూపురేఖలను మార్చివేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చిన కేటీఆర్ ఏడాది తర్వాత కొడంగల్‌కు రావడంతో సీఎం సీఎం అంటూ రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు పి.సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవిత తదితరులు పాల్గొన్నారు.


హకీంపేట వద్ద కేటీఆర్ ర్యాలీలో పాల్గొన్న భారీ జన సందోహం

- స్థానిక సంస్థల ఎన్నికలపై తొలగని సందిగ్ధం
- స్పష్టం చేయని సర్కార్
- అయోమయంలో ఆశావహులు
- గ్రామాల్లో ఇప్పటికే మొదలైన ఎన్నికల ఫీవర్
- రంగారెడ్డి జిల్లాలో 531 గ్రామ పంచాయతీలు, 257 ఎంపీటీసీలు, 21 జడ్పీటీసీలు

# వీడని ఉత్కంఠ..

## పోలింగ్ ముందు పంచాయతీలకా..? పరిషత్‌లకా..?

**స్థానిక సంస్థల ఎన్నికలు ముందుగా పంచాయతీలకా.. పరిషత్‌లకా..? అన్న ఉత్కంఠ నెలకొన్నది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ముందుగా వేటికి నిర్వహిస్తామన్నది మాత్రం చెప్పడం లేదు. దీంతో జిల్లాలోని ఆశావహులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఎన్నికల ఫీవర్ మొదలైంది. కాగా జిల్లాలో 531 గ్రామ పంచాయతీలు, 257 ఎంపీటీసీలు, 21 జడ్పీటీసీలున్నాయి. అధికారులు జిల్లావ్యాప్తంగా ఓటర్ల తుది జాబితాను కూడా ప్రకటించి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నారు.**

**-రంగారెడ్డి, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ)**




స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయోనని జిల్లాలోని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ముందుగా పంచాయతీలకా.. లేక పరిషత్‌లకా..? తెలియక వారు అయోమయానికి లోనవుతున్నారు. లోకల్ బాడీ ఎన్నికలను నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా.. ముందుగా వేటిని నిర్వహిస్తామన్న విషయాన్ని స్పష్టంగా చెప్పడం లేదు. ఇప్పటికే జిల్లాలోని గ్రామాల్లో ఎన్నికల వాతావరణ మొదలైంది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉత్కంఠ వీడడం లేదు. జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్లు ప్రకటించాలని బీసీలు పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నారు. జనాభా లెక్కల్లో బీసీల సంఖ్య తగ్గిందని తిరిగి మళ్లీ రీ సర్వే నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, రిజర్వేషన్లు గతంలో మాదిరిగానే కొనసాగుతాయా..? లేక మారుతాయా ..? అన్న దానిపైనా స్పష్టత లేదు. జనా భా ప్రాతిపాదికన రిజర్వేషన్లు ప్రకటిస్తే మార్పులు, చేర్పులు జరిగే అవకాశాలుంటాయి. జిల్లాలోని సగ భాగానికిపైగా మున్సిపాలిటీ ల్లో కలిసిపోయినా మిగతా ప్రాంతాల్లోనూ పోటీ తీవ్రంగా ఉన్నప్పటికీ అందరూ రిజర్వేషన్లపైనే గురిపెట్టారు.

### సన్నద్ధమవుతున్న పార్టీలు..

స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లాలోని ప్రధాన పార్టీలు సమాయత్తమవుతున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి క్యాడర్‌ను సిద్ధం చేస్తున్నాయి. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత ను అనుకూలంగా మార్చుకుని స్థానిక సం స్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్ఎస్ భావిస్తున్నది. అందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మండల స్థాయిలో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి లోకల్ ఎన్నికల్లో సత్తాచాటాలని సూ చించారు. అలాగే, అధికార కాంగ్రెస్ పార్టీ కూడా ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకున్నది. చేవెళ్ల, రాజేంద్రనగర్ నియోజకవర్గాల నుంచి గెలుపొందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తి నియోజకవర్గాలూ ఆ పార్టీ ఆధీనంలోనే ఉన్నాయి. అలాగే, బీజేపీ కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తున్నది.

### సత్తా చాటుతాం..



స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా సత్తా చాటుతాం. అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క దానిని కూడా సక్రమంగా అమలు చేయకపోవడంతో ప్రజల్లో ఆ పార్టీ పట్ల వ్యతిరేకత మొదలైంది. ప్రభుత్వ వ్యతిరేకతను మాకు అనుకూలంగా మార్చుకుంటాం.

**-మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు**



**జిల్లాలో 531 పంచాయతీలు.. 257 ఎంపీటీసీలు..**

జిల్లాలో మొత్తం ఓటర్లు 7,63,665 మంది ఉన్నారు. జిల్లాలో 531 గ్రామ పంచాయతీలు, 4,710 వార్డులు, 252 ఎంపీటీసీలున్నాయి. అలాగే, జిల్లాలోని ఆరు మండలాల్లోని 25 ఎంపీటీసీలు ఇటీవల మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. మొయినాబాద్‌లో 8, శంకర్‌పల్లిలో 2, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 3, శంషాబాద్‌లో 3, కొత్తూరులో 4, చేవెళ్లలో 3 ఎంపీటీసీలు మున్సిపాలిటీల్లో కలిశాయి. దీంతో జిల్లాలో 25 ఎంపీటీసీలు తగ్గగా 257 స్థానాలున్నాయి. అలాగే, 21 జడ్పీటీసీలున్నాయి.


చేవెళ్లలో శ్రేణులకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# రామన్నకు ఘన స్వాగతం

## హిమాయత్‌నగర్, చేవెళ్లలోని షాబాద్ చౌరస్తాలో పార్టీ జెండాలను ఆవిష్కరించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మొయినాబాద్ : కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో జరిగిన రైతుదీక్షకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఘన స్వాగతం లభించింది. సోమవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలిరావడంతో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి గులాబీమయంగా మారింది. కేటీఆర్ హిమాయత్‌నగర్ చౌరస్తాకు చేరుకోవడంతో చౌరస్తాలో జై తెలంగాణ..జై కేసీఆర్..జై కేటీఆర్..సబితమ్మ నాయకత్వం వర్ధిల్లాలి అనే నినాదాలు మార్మోగాయి. మొయినాబాద్ బీఆర్ఎస్ నేతలు, నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం చౌరస్తాలో పార్టీ జెండాను మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీగా తరలొచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులకు అభివాదం చేసి ధన్యవాదాలు తెలిపారు. అలాగే, చేవెళ్ల మండల కేంద్రంలోనూ మాజీ మంత్రికి బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన షాబాద్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, బీఆర్ఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మండలాల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, రైతు సమన్వయ సమితి మండల మాజీ కన్వీనర్ శ్రీహరియాదవ్, చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, సీనియర్ నాయకులు గునుగుర్తి జయవంత్, రవియాదవ్, నర్సింహగౌడ్, సుధాకర్‌యాదవ్, హిమాయత్‌నగర్ మాజీ సర్పంచ్ మంజులారవియాదవ్, మాజీ ఉపసర్పంచ్ షాబాద్ శ్యాం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవూఫ్, నాయకులు రాము, రితీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజు, సురేందర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, పరమేశ్, ప్రవీణ్, రవీందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జంగయ్య, మహేందర్, రాఘవేందర్‌యాదవ్, అంజిరెడ్డి, తిరుపతిరెడ్డి, చెన్నయ్యయాదవ్, రాజుగౌడ్, దర్శన్, డేవిడ్, మిట్టు, అరవింద్, రాంప్రసాద్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.